# 4

# కప్పు కూలినప్పుడు

## మరణం మరియు అసాధ్యమైన పరిస్థితులు ఎదుర్కొనుట

## (1 రాజులు 17:17-24)

సృష్టిలోని మహా భయంకరమైన ఉపద్రవాన్ని మీరు ఊహించుకోగలరా? నా భార్య జో ఎప్పుడు ప్రాణ భయంతో జీవిస్తుంది. ఆమె భయమేమంటే ఏ సమయంలో ఏ ఉప్పెన వచ్చి తనను పొట్టన పెట్టుకుంటుందో అన్నది ఆమె భయం. నేను వ్యక్తిగతంగానైతే ఒక పెద్ద భూకంపం కల్గి నా కాళ్ళకింద భూమి పాయలుగా విచ్చుకొని పోతుందేమో అన్న ఆందోళన పడుతుంటాను.

మరొక చోట ఎక్కడో ఇంటి కప్పు కూలిన వార్తలు వింటుంటాం. డల్లాస్ మహా పట్ట ణంలో ఆరాధనా సమయంలో పూర్తిగా కప్పు కూలిన సందర్భం యీ మధ్యనే జరిగింది. భూకంపం జరిగింది. అది శీతాకాలం, తుఫాను ఎంతో ప్రచండంగా వస్తుంది. మంచు పడడంవల్ల యింటి కప్పు మీద ఆ బరువైన మంచు అలాగే ఎంతో కాలంగా నిలిచింది. ఆకస్మాత్తుగా ఆ పై కప్పు కూలి ఆరాధన చేసే వారి మీద పడినప్పుడు ఎంతో మంది వారి ప్రాణాలు కోల్పోయినారు, ఎంతోమంది గాయపడినారు కూడ. ఇది ఎంత భయంకరమైన విషయమో మనం గ్రహించగలం!

మన జీవితాల్లో కూడ అవాంతర పరిణామాలు ఎదురైనప్పుడు మనం ఊహించని రీతిగా పరిస్థితులు విషమించినప్పుడు మనం ఎంతో అధ్వాన్నమైన స్థితికి దిగజారి పోతాము. ఇక్కడ మనం చదువుతున్న ఏలీయా, సారెపతు విధవరాలి కథలో వారి మీద కప్పు విరిగి పడినప్పుడు పరిస్థితులు ఏమి జరిగిందో చూచుటకు ప్రయత్నించుదాం (1 రాజులు 17:17-24).

ఇక్కడ ఉపోద్ఘాతాన్ని బట్టి చూచినట్లయితే, మనం హెబ్రీయులకు 11వ అధ్యాయం చూద్దాం. అది ఒక “విశ్వాసం” అనే అంశం పై ఆధారపడియున్న గొప్ప అధ్యాయం. అది “పరిశుద్ధాత్మ పూర్ణమయిన సంక్షిప్త బైబిలు” అని చెప్పాలి. ఈ అధ్యాయం విశ్వాస వీరుల గురించి తెల్పుచున్నది: హేబెలు, హనోకు, నోవహు, అబ్రహాము, ఇస్సాకు, యాకోబు, మోషే ఇంకా యితరులు. *విశ్వాసం* ద్వారా దేవుడు వారికి చెప్పింది చేశారు అంటూ ఎంతో భావయుక్తంగా నొక్కి వక్కాణించబడింది. తర్వాత 32 వచనంలోకి వచ్చినట్టయితే: “ఇకను ఏమి చెప్పుదును గిద్యోను బారాకు సమ్సోను, ...” 32వ వచనంలోని చివరి భాగంలోకి చూస్తే: “ప్రవక్తలను గూర్చియు.” ఏలీయా కూడ యీ జాబితాలో చేర్చబడి యున్నాడు. ఈ వ్యక్తులంతా “విశ్వాసం” ద్వారా ఏమి చేశారు? ఇక్కడ హెబ్రీ పత్రిక గ్రంథకర్త

వ్రాస్తూ వారు రాజ్యాలు జయించారని, ఖడ్గ ధారను తప్పించుకున్నారు, యుద్ధములో పరాక్రమశాలులైరి (33, 34 వచనాలు). ఇక్కడ 35వ వచనం ప్రారంభంలో: "స్త్రీలు మృతులైన తమ వారిని పునరుత్థానము వలన మరల పొందిరి." యేసు ప్రభువు మరియు కొందరు భక్తులు చనిపోయినవారిని లేపడం మనం చూస్తాం. మొట్టమొదటిసారిగా యిది జరిగిన సందర్భం చూస్తాం!

## సాక్షాత్తు నిజం (17:17, 18)

అసాధ్యమైన పరిస్థితులు నిజ జీవితానికి వాస్తవాలుగా నిలుస్తాయి. నీవు గనుక ఎక్కువ కాలం జీవించినట్లయితే యిలాంటి విషయాలను ముఖాముఖిగా ఎదుర్కొంటాం. ఒక సారి నేను టెక్సాస్‌లోని సెల్‌చర్చ్ అనే పట్టణంలోని సంఘంలో వాక్య పరిచర్య చేస్తున్నాను, ఆ రోజుల్లో మా సంఘ సభ్యుడొకడు గుండె జబ్బు అనేది లేనప్పటికి ఆ గుండెనొప్పితోనే చనిపోయాడు. మరుసటివారంలో ఒక యువకుడు డల్లాస్‌లోని ఒక ఐదు కార్ల గుద్దులాటలో అకస్మాత్తుగా మరణించాడు. అతని చిన్న పాప చచ్చిపోయింది, అతని భార్య చచ్చిపోయింది, అతని పెద్ద కుమార్తె బాగా గాయపడింది. తర్వాత వారంలో, ఆ పట్టణంలోని ఒక బస్తీలోవున్న యువకుడు అతని భార్య కాల్చి చంపబడినారు. ఈ విధమైన సంఘటనలు ప్రతి కుటుంబంలో ఉంటాయన్న సంగతి నేను మీకు ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అసాధ్యమైన పరిస్థితులు సంభవించడం సహజం; అది ప్రతివారి జీవితంలో సహజమే.

మరణం అనేది వాస్తవం. మరణం గురించి మనం ఆలోచించడానికి కూడ యిష్టపడం. మరణంతో మనం శక్తికొలది ఎదురాడతాం. మనం ఎంతగా దాన్ని విస్మరిస్తామంటే అంతగా విస్మరిస్తాం. అది గనుక సంభవించబోతుంది అంటే, అది తప్పించుకోడానికి వ్యక్తులకు లంచాలిచ్చైనా తప్పించుకోడానికి ప్రయత్నిస్తాం. కొన్ని సార్లు మనం సమాధుల కార్యక్రమాలకు వెళ్ళకుండా తప్పించుకుంటాం. ఏదేమైన మరణం వాస్తవమైనది. పూర్వకాలంలో, సర్పం స్త్రీతో యిలా అన్నది, "మీరు చావనే చావరు" (ఆదికాండము 3:4). స్త్రీ ఆమె భర్త పాపం చేశారు, అప్పుడు మరణం ఈ లోకంలో ప్రవేశించింది. హెబ్రీయులకు 9:27 యిలా అంటుంది, "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను."

మన కథలోని స్త్రీకి మరణమంటే బాగా తెలుసు. అంతకు కొద్ది కాలం క్రితమే ఆమె తన పెనిమిటిని కోల్పోయింది. ఇక ఆ వివరాలేమియు మనకు తెలియదనుకోండి. బహుశ అది ఆకస్మిక మరణమై ఆమె గుండె పగిలి ఉండవచ్చు, లేదా అది నిధానంగా సంభవించిన మరణమై ఆమె హృదయాన్ని గాయపరచి యుండవచ్చు; ఏదైతేనేం ఆమె భర్తయితే మరణించాడు. తర్వాత ఆ భయానక కరువు ఈ తల్లిని కుమారుని జీవచ్ఛవాలుగ మిగిల్చింది. కాని ఏలీయా ప్రవక్త ద్వారా ఆమెకు తాత్కాలిక విముక్తి లభించింది. తర్వాత 17వ వచనంలో, "అటు తరువాత ఆ యింటి యజమానురాలైన ఆమె కుమారుడు రోగియై ప్రాణము నిలువ జాలనంతగా వ్యాధిగలవాడాయెను."[1]

"ఈ సంగతులన్ని జరిగిన తర్వాత": ఆశీర్వాదాలన్ని లభించిన తర్వాత, మరణంనుండి విడుదల చేయబడిన తర్వాత, పిల్లవాడు చక్కగా ఎదుగుచూ ఆరోగ్యం కోలుకుంటున్న

తర్వాతనే ఇది సంభవించింది!

"అతనికి కొద్దిగా కూడా ఊపిరాడటం లేదు" బహుశ ఆ బాబుకు శ్వాసకోశములకు సంబంధించిన జబ్బు ఉండియుంటుంది. ఎవరైనా తలిదండ్రులు వారి పిల్లలకు ఆస్తమా లేక శ్వాసకోశాల జబ్బు యితర వ్యాధులున్నట్లతే ఈ విషయంలో సానుభూతి చూపించవచ్చు. ఒక బిడ్డ ఊపిరాడక విలవిలాడ్డం చూస్తుంటే ఎవరు తట్టుకొనగలరు, యింతకంటే భయంకర సంఘటన ఏమైనా ఉంటుందా చెప్పండి.

అతనిలో ఏ రోగం ఉందో ఆ తల్లికి మాత్రం ఏమి తెలుసు. వాడు రోజు రోజుకు క్షీణించి పోతుంటే ఆమె చూడలేక పోతుంది. పాపం ఆ ప్రాణం లేని బిడ్డను చేతుల్లో ఎత్తుకొని, బావురుమంటూ గుండె బద్దలు కొట్టుకొని ఏడ్చుకుంటూ నిస్సహాయ స్థితిలో ఎటు పరుగెత్తాలో తెలియక అలమటిస్తున్న తల్లి. ఆమె తన భర్త కాలంచేసిన తర్వాత తనకు మిగిలింది ఈ పిల్లవాడే పాపం, తన నిరీక్షణకు ఆధారం, ఆమె భవిష్యత్తు పట్ల కలలుగనేది వాడి గురించే. తనకెవరూ లేరు. నీవు గనుక ఆమె పరిస్థితుల్లో ఉంటే తప్ప ఆమె బాధ ఎలాంటిదో గ్రహించలేవు.

విషాదం, దుఃఖ సాగరంలో ఆమెను ముంచివేసింది. ఒక దుసాధ్యమైన నిస్సహాయ స్థితిలోకి ఆమె జారుకుంది. ఇక తనకెవ్వరు సహాయపడరు పడలేరు అని నిశ్చయత నిరుత్సాహంలోకి ఆమె పడిపోయింది. బహుశ ఈ సమయంలో నీవు అదే స్థితిలో యుండి వుండవచ్చు. బహుశ ఆలోచించి ఆలోచించి ఒకవేళ పిచ్చిపడుతుందా అన్న స్థాయికి చేరుకొనియుండవచ్చు.

నీవేం చేయగలవు? కాని ఈ పుత్ర హీనురాలైన తల్లి ప్రస్తుత నిస్సహాయ స్థితిలో యిలా అంటుంది: "దైవ జనుడా, నాయొద్దకు నీవు రానిమిత్తమేమి? నా పాపమును నాకు జ్ఞాపకము చేసి నా కుమారుని చంపుటకై నా యొద్దకు వచ్చితివా" (18 వచనం).

ఇక్కడ "దైవ జనుడా" అనడంలో ఆయననేదో ఎత్తి పొడిచినట్టు మాట్లాడింది, "నీవేదో ప్రాణదాతవు అనుకొన్నాను కాని ప్రాణాలు తీసుకునే వాడివనుకోలేదు, ఆహా ఎంత క్రూరమైన యుక్తి పన్నినావయ్యా?"[2]

మొదట్లో మనం ఆ విధవరాలును చూసినప్పుడు మరణం పట్ల ఆమెకు గల దృక్పథం ఇందుకు భిన్నంగా ఉంది. అప్పట్లో ఆమె తనకు తన కుమారునికి చివరకు ఎలాగో ఆహారం తయారు చేసుకోడానికి పుల్లలను ఏరుకునేది. అప్పుడు ఆమె మరణమే మేలనుకుంది. ఈ పరిస్థితి వారాల కొలది కొనసాగింది. ఆమె మరణం తథ్యమనుకుంది. ఇప్పుడు, ఎలాగైతేనేం, మరణం ఆకస్మికం అయింది. ఆమె సంసిద్ధంగాలేదు. అందుకనే ఆమె ఏలీయా మీద విరుచుకుని పడింది.

కొందరు తమకు ప్రియమైన వారు అనారోగ్యంతో పీడింపబడుతున్నప్పుడు వారాలకు వారాలు నెలలకు నెలలు, సంవత్సరాలకు సంవత్సరాలుగా వారి మంచం పక్కన ఉండి వారు పడే బాధను చూస్తుంటారు. అటువంటి రోగుల మరణానికి ఒక విధంగా సంసిద్ధులై ఉంటారు. ఒకప్పుడు అటువంటివారి మరణమే మేలని అనుకుంటారు. అలా కాకుండ, మనకు ప్రియతములైన వారికి యింకా సంతోషమయమైన జీవితం చాలా ఉంది అనుకున్నప్పుడు మరణం హఠాత్తుగా కలిగితే మన హృదయం పగిలిపోతుంది!

మనస్తత్వ శాస్త్రజ్ఞులు ఒక సత్యాన్ని చెబుతున్నారు. ఎవరైనా మన దగ్గరవాళ్ళకు

హఠాత్తుగా మరణం సంప్రాప్తించింది అనుకోండి. తిరిగి కోలుకోవడానికి ఈ క్రింది దశలను దాటాలి:

1. ఏదో షాక్ విధానం
2. ఏదో మానసికంగా నడిపింపు
3. ఒంటరితనం, మానసికంగా కృంగిపోవడం
4. విచారము లేక ఆందోళన
5. అపరాధ భావన
6. పగ లేక ఆగ్రహము
7. సహజమైన కార్యకలాపాలు కొనసాగించాలని శ్రమపడుట

అందరూ ఇదేవిధంగా ఈ స్థితులను యింత తీవ్రంగా అనుభవించరు. కాని దుఃఖంతో తట్టుకోలేక పోతుంటారు. దుఃఖాన్ని ఎదుర్కునేటప్పుడు మనం కొంత ధైర్యాన్ని పూనాలి. దుఃఖానికి లొంగి పోకూడదు.

ఒక వేళ "పగ లేక ఆగ్రహము." మనం కోప్పడతాము. ఒకవేళ ప్రస్తుత పరిస్థితినిబట్టి మనం కొంత కోపంతో చలించిపోయి యుండవచ్చు. మనం ఏమి చేయకపోయినా కొన్ని సార్లు మనమీద మనకు కోపం వచ్చియుండవచ్చు. మనకు ఈ రోగం వచ్చినందుకు నర్సుల మీద డాక్టర్ల మీద మనం మండిపడవచ్చు. ఇది వచ్చినందుకు చివరకు దేవుని మీదే కోప్పడి యుండవచ్చు. మనలను ఒంటరి చేసి చనిపోయిన వారి పట్ల కూడ మనం కోప్పడి యుండవచ్చు. అది ఎంతైనా సత్యం: ఏదో ఒక కారణాన్ని బట్టి మనం కోపం తెచ్చుకొనియుండవచ్చు.

సారెపతు విధవరాలికి కూడ కోపం వచ్చింది, ఇష్టానుసారంగా కోప్పడింది. ఆమె కోపానికి కారణం ఆస్కారం ఏలీయా. ఎందుచేత? ఏలీయా ఆమె పట్ల ఏ నేరం చేశాడు? అతనామెకు ఏ నష్టం చేయలేదు అంతా మేలే చేశాడు. ఏలీయా యొక్క దేవుడు ఆమెకేం చేశాడు? ఆయనేం చేయలేదు కేవలం మంచే చేశాడు. ఎలా ఐతేనేం ఏలీయా అందరిని కొరడాలతో కొట్టే కుర్రాడయ్యాడు. ఆమె ఎంతో కోపంతో ఏమంటుందంటే "నన్ను నా పాపాల కోసం నన్ను శిక్షించడానికి వచ్చావా, నన్ను చంపడానికి బదులు నా కొడుకును చంపుతావా. నేను చేసిన ఏదో నేరానికి నా కొడుకు చచ్చాడు."

ఇది బహుశ అంతుబట్టని వేదాంతం, కాని యిది సహజమైన భావన. మనకు ఏదైనా సంభవిస్తే అది మనం ఏదో చేయబట్టి దేవుడు పంపించినది అనుకుంటాం. "అయ్యో, ఎందుకు దేవా? ఇది నాకు సంభవించడానికి నేనేం చేశాను" ఎంతో కాలంగా ఇలా అనుకోవడం సహజమై పోయింది. అది మనకు తెలుసు. యోబు బ్రతికిన రోజుల్లో కూడ అతని "స్నేహితులు" అనుకున్నారు. అతడేదో చేయరాని పాపం చేశాడు అందువల్ల అలా జరిగింది అని. యేసు ప్రభువు యొక్క శిష్యులు సైతం ఒక పుట్టు గ్రుడ్డివానిని చూచినప్పుడు ఆయనను అడిగారు "బోధకుడా, వీడు గ్రుడ్డివాడై పుట్టుటకు ఎవడు పాపం చేసెను? వీని కన్నవారా?" (యోహాను 9:2). యేసు వెంటనే చెప్పాడు అబ్బే వీడు ఈ స్థితికి రావడానికి వీడి పాపాలు కాదు లేదా వాడి తలిదండ్రుల పాపాలు కాదు (3 వచనం).

ఇక్కడ తత్వం నిజం *కాదు*. ఇక్కడ బాధపడడానికి వ్యక్తిగత పాపానికి అవి నా భావ సంబంధమేమియు లేదు. ఒకే సారి పౌలు తన "శరీరంలో ముల్లును" గూర్చి ప్రస్తావిస్తూ, దేవుని ఉద్దేశాన్ని ఆయన ప్రణాళికను తన జీవితంలో నెరవేర్చడానికోసం ఆ ముల్లును తన శరీరంలో పెట్టినాడు అని స్పష్టం చేస్తున్నాడు (2 కొరింథీయులకు 12:7-9). ఇక్కడ మనం చదువుచున్న ఈ కథ ఒక సరళమైన విధానంలో ఒక్కొ అడుగు ముందుకు సాగుచున్నది. ఒక వ్యక్తి దేవుని యొక్క ప్రణాళిక, ఆయన ఉద్దేశంలో యిమిడి యున్నప్పటికి కష్టాలు రావనడానికి ఆస్కారము లేదు. ఆ గృహంలోనే ఈ ప్రవక్త కూడ జీవిస్తున్నాడు. ఇక్కడ దేవునికి విధేయురాలైన స్త్రీని చూస్తున్నాం, ఆమె ప్రతిరోజు ఆశీర్వదించబడింది. అద్భుతాలు చూసింది, అయినా ఆమె గృహంలో దుఃఖం చోటు చేసుకుంది.

మరణం మరియు అసాధ్యమైన విషయాలు అలాంటి పరిస్థితులు లోకంలో సహజమే. అవి ఎవరినైనా ఎప్పుడైనా తాకవచ్చు, వారు గొప్ప భక్తులే అయ్యుండవచ్చు, వారు మంచి నమ్మకస్తులును అయ్యుండవచ్చు. అవి మీ గృహంలో కూడ సంభవించ వచ్చు.

## పరిహారము (18:19-21)

ప్రస్తుతం ఒక్కసారి మనం ఏలీయా స్థానంలో ఉన్నట్లు భావిద్దాం. "నీవు నాకెందుకు అన్యాయం చేశావు, మోసగించావు" అంటూ విధవరాలు నీ పై అరవడం ఊహించుకో? దీనికి నీవెలా స్పందిస్తావు?

మనమే గనుకైతే ఎలా మండిపడతామంటే: "ఒసేయ్, దౌర్భాగ్యురాలా! ఈ రోజున నీవు బ్రతికున్నావంటే ఎలా అనుకున్నావు? నేనే గనుక రాకపోయినట్లయితే మీ బాబు రెండేళ్ళ క్రితమే చచ్చివుండేవాడు – నీవు కూడా గుటుక్కుమనేదానివే!" ఏలీయా మాత్రం అలా అనలేదు, అలా మండిపడలేదు!

బహుశ నీవు ఆమెను యిలా అంటూ కించపరచవచ్చు: "అసలు నీవు పొందిన ఆశీర్వాదాలను నీవు లెక్కవేసుకోలేవా. ఇప్పటికి నీ కొడుకును రెండేళ్ళకు పైగా బ్రతికించుకున్నావంటె అదెంత గొప్ప విషయం. ఇంకా నీకన్న అధ్వానమైన స్థితిలో ఉన్న వాళ్ళు ఎంతో మందివున్నారు చూచావా. త్వరలోనే మంచి రోజులు వస్తున్నాయి చూడు." అది*కాదు* ఏలీయా యొక్క ప్రత్యుత్తరం.

బహుశ మనం గనుక అయితే ప్రసంగాల మీద ప్రసంగాలు చేస్తూ ఆమె యొక్క వేదాంతాన్ని దుయ్యబట్టేవాళ్ళం, వ్యక్తిగత పాపానికి వ్యక్తిగతంగా శ్రమ అనుభవించడానికి మధ్యగల తేడాను ఎత్తి చూపడానికి పాతిక ప్రసంగాలు గుప్పించియుండేవాళ్ళం. మరలా మీతో అంటున్నాను, ఆ పని కాదు ఏలీయా చేసింది.

ప్రజలు గనుక అసాధ్యమైన పరిస్థితుల్లో యిరుకున పడినప్పుడు వాళ్ళు నీ తర్కంతో కూడుకున్న ప్రసంగాలు చర్చలు అర్థం చేసుకునే మనస్తత్వం కలిగియుండ లేరు. అసలు వినరు కూడ. నేను నా భార్య జో కాలేజీనుండి బైట పడగానే ఓక్లహోమా పట్టణంలో జీవించేవాళ్ళం. మేము యింటికి వెళ్ళే దారిలో హోమర్‌గారు మరియు సతీమణి ఎడిత్ బీవర్‌గారిని కలుస్తుండేవారిమి. వారు మాకు తలిదండ్రులాంటివారు. ఒక రోజు ఫోన్‌లో విషాదకరమైన వార్త వచ్చింది: ఎడితర్‌గారు టెక్సాస్ నగరంలోని విచిత్ ఫాల్స్ అనే కూడికలో భయంకరమైన కారు ప్రమాదంలో అక్కడకక్కడికే మరణించారన్న

వార్త అది. నేను జో కలిసి ఆ కార్యక్రమానికి వెళ్ళాము. అందరికంటె కొన్ని నిమిషాల ముందే అక్కడ చేరుకున్నాము. ఆ కార్య భూస్థాపన కార్యక్రమంలో నేనే ప్రసంగించవలసి ఉందని తెలుసుకొని ఆశ్చర్యపడ్డాను. అంతకుముందే భూస్థాపన కార్యక్రమాలు కొన్ని నిర్వహించియున్నాను, ఆ వారమంతా, "లోకంలో ఎందుకీ బాధలు కష్టాలు?" అనే అంశం మీద పుస్తకాలు చదువుచున్నాను. అప్పటికే కొంత నోట్సు వ్రాసుకున్నాను యిక ఎడిత్ గారిలాంటి విషాదకరమైన సంఘటనలు ఎందుకు సంభవిస్తాయి అన్న అంశం గురించి బైబిలునుండి ఎంతో గొప్ప వివరణాత్మకంగా వివరించగల్గినానని నాకు నేను మెచ్చుకున్నాను. తర్వాత నేను సమాధి పెట్టె (శవ పేటిక) దగ్గర నిలుచున్నప్పుడు ఎడిత్ గారి కుమార్తె నా దగ్గరకు వచ్చి నాకు వందనాలు తెల్పింది, "అంకుల్ మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలను కుంటున్నాను, మా అమ్మగారు చనిపోవడమెందుకు?" ఇక్కడ మరలా చెబుతున్నాను, ఎవరైనా సరే అసాధ్యమైన పరిస్థితుల్లో యిరుక్కొని ఉంటారో వాళ్ళు పెద్ద పెద్ద, తాత్విక చర్చలు వినినే వినరు.

ఆ స్త్రీ తన మీద మండిపడినప్పుడు ఏలీయా వైఖరి ప్రత్యుత్తర మెలావుంది? "నీ బిడ్డను నా చేతికిమ్మనెను" (19 వచనం) అంతేగాని అక్కడ నిలబడి ఆమెతో వాదించలేదు. లేదా ఆమె మాట్లాడే విధానాన్ని సరిచేద్దామని ప్రయత్నించలేదు. అతను చెప్పింది, "నీ బిడ్డను నా చేతికిమ్ము" అన్నాడు అంతే.

తరువాత వచనాల్లో చూస్తే, ఏలీయా ఐదు రీతులుగా సహాయం చేశాడు అని వ్రాయపడింది. ఏలీయా సహాయపడుటకు ఐదింటిని చేశాడు, "అసాధ్యమైన పరిస్థితుల్లో" ఎవరైనా చేయగల ఐదింటిని చేశాడు:

(1) అతనక్కడ ఉన్నాడు. ఇదేదో ఎంతో సులువుగా కనబడవచ్చు. మనం యితరులకు సహాయం ఏదో చేయాలని ఎంతో ప్రయత్నాలు చేసేకంటె కూడ యిదెంతో గొప్పది. నీవు చెప్పాలనుకున్న వందలాది మాటలకంటె నీవు అక్కడ హాజరైయుండడమెంతో శ్రేష్ఠమైనది. ఒక వేళ నీకు చెప్పడానికి మాటల్లేకపోతే, మౌనంగా అక్కడ నిలబడి యుండు. వాళ్ళ చుట్టు నీ హస్తాలువేసి ఆదరించు; ఒక చిన్న ముద్దు అన్నివిధాల ఆదరణ అనురాగలతో వారిని స్పర్శించి సున్నితంగా ముద్దుపెట్టుకొనుము.

ఇంతకు ముందు ఒక ప్రాముఖ్యమైన వ్యక్తి ఆకస్మాత్తుగా గుండె నొప్పితో మరణించడం గూర్చి చెప్పాను గుర్తున్నాదా, కొంత కాలం తర్వాత ఆ విధవరాలి దగ్గరకు వెళ్ళి దర్శించాను. అప్పుడు ఆమె అన్నది, "అయ్యా నా అనుభవములో నేను గ్రహించినదేమంటే ఒకరు దుఃఖసాగరంలో మునిగియున్నప్పుడు ఆ సమయంలో ప్రజలు వచ్చి వారు ఏదో చెప్పేదానికంటె మేలైనది అన్నది వారక్కడ హాజరై నిలబడితే చాలు."

ఇంకొక మాట కూడ నేనిక్కడ చేర్చాలి: నీవు గనుక ఎవరినైనా నిజంగా ప్రేమించినట్ట యితే వారి దగ్గర ఎంత తరుచుగా వాళ్ళ దగ్గరికి వారం వారం, నెలనెల ఎంత వీలైతే అంతగా వారిని దర్శించాలి. వారని ఒక్కొక్కరు విడిచి పెట్టి వారి స్థలాలకు వారి వారి కార్యక్రమాలకు వారు వెళుతుంటారు, అప్పుడు వారిని ఒంటరితనం పీడించడం మొదలుపెడుతుంది.

(2) అతను ఆమె పట్ల సానుభూతి కనబర్చినాడు. 20వ వచనం గమనించండి, అతనెంతగా దేవుని సన్నిధిలో మొరపెట్టినాడో. ఈ విషాదకరమైన సంఘటన ఆమెకు

అర్థంకాలేదు, యితనికి కూడ అర్థం కాలేదు కూడ. ఆ దుఃఖసాగరంలో మునిగిన తల్లిపై జాలిపడ్డాడు. పౌలు అన్నట్లు, "ఏడ్చువారితో ఏడువుడి" (రోమీయులకు 12:15).

(3) ఇతరులు ఎలాంటి పరిస్థితులో ఉన్నా సరే తను నింపాదిగా ఉన్నాడు. అతను దుఃఖముతో మునిగి ఉన్నప్పటికి ఆ విధవరాలి ముందు తన దుఃఖాన్ని కనపరచుకోలేదు. ఇక్కడ వీరిద్దరికి మధ్యగల తేడాచూడండి. ఇక్కడ ఆమె ఎంతో బాధతో ఏడ్చింది (18 వచనం) కాని అతడైతే "నీ బిడ్డను నా చేతికిమ్ము" అన్నాడు (19 వచనం).

నీవు గనుక యీ బాధాకరమైన పరిస్థితులకు యింకా కొన్ని చేర్చిన యెడల, నీవు సహాయపడలేవు. నీవు గనుక నీ బాధను భావోద్రేకాలను నీ స్వాధీనంలో ఉంచుకోలేనట్లయితే, నిన్ను నీవే సహించుకొని, అక్కడనుండి ప్రక్కకు వెళ్ళి పో, నిన్ను నీవు తమాయించుకో *తిరిగి వచ్చి* ఒకరిని ఆదరించు.

(4) అతను తాను చేయగలిగిందేదో దాన్ని చేశాడు. ఆ బాలుని ఎత్తుకొన్నాడు, తన గదిలోనికి తీసుకెళ్ళాడు, తన పడకపైన పరుండ పెట్టినాడు. ఇలా చేయడానికి అతనెంతో మానసికంగా శ్రమపడవలసివచ్చింది. మోషే ధర్మశాస్త్ర ప్రకారం, ఎవరైనా ఒక శవాన్ని ముట్టుకున్నవాడు ఆచారపరంగా అపవిత్రుడైనాడు. అందువల్ల ఎవరుకూడ తొందర పడి ఒక శవాన్ని ముట్టుకోరు. కాని ఏలీయా మాత్రం తను చేయవలసింది తాను త్యాగపూర్వకంగా చేయగల్గినాడు.

శ్రమలు, బాధల్లో ఉన్నవారి మనసుల్లోనుండి వారి బాధను తీసివేయడానికి మనం చేయగల్గిన ప్రయత్నాలు బోలెడన్ని వివరంగా ఉన్నాయి: మనం వారికి ఒక ఫోన్ చేసి ఆదరించవచ్చు, వారిని గూర్చి శ్రద్ధ వహిస్తూ వారి క్షేమార్థమై కొన్ని ఏర్పాట్లు చేయవచ్చు, వారిని ఆయా ప్రదేశాలకు చేరవేయడంలో చేయూతనివ్వడం, ఇంకా ఇంకా చెప్పాలంటే, అంట్లు తోమడం, కొద్దిగావండి పెట్టడం వేడివేడిగా వడ్డించడం లాంటివేమి మనబాధ్యతల్లో తీసిపోవు. బహుశ గతంలో మీరు "*నేనేం చేయాలో* నాకు తోచుబడి కాలేదు" అని అనవచ్చు. నీవు ఏదో ఒకటి నీ చేతనయినంత చేయగలవు అన్న అవగాహన నీకున్నదా? అలాంటప్పుడు వెంటనే చేయుము.

కొంతకాలం క్రిందట *రీడర్స్ డైజెస్ట్* అనే పత్రికలో "నేను నీ చెప్పులు తుడవడానికి వచ్చాను." అనే ఒక చక్కని వ్యాసం వచ్చింది. ఏదైనా మరణం సంభవించినప్పుడు ఒక వ్యక్తి ఏంచేయాలో అతనికి తెలియదు. అతని కుటుంబంలోనే మరణమున్నది. యింతలో ఎవరో ఒకరు వస్తారు యింట్లో చెప్పులన్ని శుభ్రం చేసి పోతారు. అప్పుడు, వారంతా అంతిమ భూస్థాపన కార్యక్రమానికి సిద్ధమవతారు. తర్వాత మరణం అనేది ఎక్కడ సంభవించినా అతను ఆ గృహానికి వస్తాడు, చెప్పులన్ని జమచేసుకుంటాడు వాటిని శుభ్రం చేస్తాడు.

(5) ఇది చాలా ముఖ్యమైనది, ఏలీయా ఈ దుఃఖముఖురాలైన స్త్రీ పక్షంగా దేవుని దగ్గరకు వెళ్ళినాడు. 20వ వచనంలో చూచినట్లయితే తన హృదయ బాధనంతయు దేవుని దగ్గర కుమ్మరించాడు: "యెహోవా నా దేవా, నన్ను చేర్చుకొనిన యీ విధవరాలి కుమారుని చంపునంతగా ఆమెమీదికి కీడు రాజేసితివా" అంటూ ప్రార్థించాడు. వెంటనే ఆ మరణించిన శిశువు మీద చాచుకొని పడుకున్నాడు; నోటికి నోరు తగిలించాడు, కంటికి కన్ను, చేతికి చేయి ఆనించాడు (చూడు 2 రాజులు 4:34). ఆ విధంగా చేసి **ప్రభువుకు**: "ఈ చిన్నవాని ప్రాణము మరల రానిమ్మని యెహోవాకు ప్రార్థించెను" (21 వచనం).

ఆ యొక్క బాలుని మీద ఏలీయా అలా చాచుకొని ఎందుకు పడుకున్నాడో తెలియదు, ఆ విషయం బైబిలు మనకు బోధించదు. అలాచేయడం ద్వారా ఆ దేహానికి వెట్టకలిగించడానికేనా? బహుశ (చూడు 2 రాజులు 4:34) ఇది ఆ బాలుని తిరిగి బ్రతికించడానికొక మొదటి ప్రయత్నమేమో?[3] ఏమో నాకైతే అనుమానంగా ఉంది.

దయచేసి గమనించండి యిది గతంలో ఎప్పుడూ జరగలేదు. ఆదాము హవ్వలు హేబెలును భూమిలో పెట్టినారు. అతను తిరిగి లేవలేదు సుమా! ఏలీయా రోజువరకు ఎన్నెన్నో వేలకొలది మంది మరణించారు, కాని ఒక్కరైనా తిరిగి బ్రతికినట్లు లేదు; మనకు తెలిసినంతవరకు మనలో ఎవరికి కూడ చనిపోయిన వాళ్ళను లేపమని దేవునినడిగే సాహసం లేనే లేదు. కాని యిక్కడ ఏలీయా అసాధ్యమైన దాన్ని సాధ్యపరచడానికి ప్రయత్నించుచున్నాడు. (ఇక్కడ మనం "అసాధ్యమైన పరిస్థితుల గురించి" మాట్లాడుతున్నామని మరచిపోవద్దు!) అతనికి గతంలో జరిగిన దృష్టాంతమైనను లేదా నమూనా చేతి పుస్తకము లేనే లేదు.

మనం గనుక అసాధ్యమైన పరిస్థితులపై ఎదురీదుకొంటూ వెళ్తున్నప్పుడు మనకు ఒక చేతి పుస్తకం దారిచూపించడానికంటూ అవసరమని తెలియదా? ఉదాహరణగా "ఓర్పు అనే దానిపై ఒక చేతి పుస్తకం మన నడిపింపుకోసం వాడవలసి వచ్చిందనుకోండి ఒక వేళ నీలో అసహనం అనేది చాలా క్లిష్టమైన సమస్య యున్నట్లయితే పై చెప్పబడిన ఐదు యింకా ఆరైనా చేయడానికి సంసిద్ధులవండి"; లేదా మరణం అనేదానితో వ్యవహరించుచున్నట్లయితే కూడ అదే పని చేయండి: "ఒక్కొక్క అడుగు ముందుకు వేయండి. ఈ విధానాలు ఒక్కటి, రెండు మూడు అలా అనుసరించండి. ఒక వేళ మీ కుమారుడుగాని, లేదా తల్లిగాని మరణించినా ఈ ఐదు అంశాలే కాదు ఏడు అంశాలైనా అనుసరించండి." దేవుడు మాత్రం మనకలాంటి చేతి పుస్తకాన్ని యివ్వలేదు. ఆయన బైబిల్ అను తన పరిశుద్ధ గ్రంథాన్ని చేతి పుస్తకంగా అనుగ్రహించాడు. దాని ద్వారా ఎలాంటి సమస్యతోనైనా మనం వ్యవహరించవచ్చు కాని అది కూడ 1-2-3 అనే అంశాలతో వ్యవహరించే చేతి పుస్తకం మాత్రం కాదు. కాని అది గొప్ప నియమావళుల పుస్తకం. దేవుడు ఏమంటున్నాడంటే, "ఈ నియమావళులు, సూత్రాలనన్నింటిని మనం అనుసరించడానికి సర్వస్వతంత్రం సామర్థ్యత గలవారమని దేవుడు మనలను ప్రశంసిస్తున్నాడు."

ఏలీయా దగ్గర చచ్చినవాళ్ళని ఎలా తిరిగి లేపాలి అనే చేతి పుస్తకం లేదు కాని అతను చేసినదంతా "నీవు చేసేదేదో చేయుము" అన్న శీర్షికకిందకి వస్తుంది. తన శరీర వేడితో ఆ బాలుని శవానికి వెట్ట కలిగించడం అనేది అది సబబనిపించింది, అందుకని అలా చేశాడతను. తర్వాత ఆ బాబు తిరిగి ప్రాణంపోసుకున్నాడు లేచి కూర్చున్నాడు. ఆ విధవరాలను చూచి అతనెంతో అబ్బురపడి, తన చిట్కాను ఎలీషాకు చెప్పినాడు. అందుచేతనే ఎలీషా అదే పని చేశాడు (2 రాజులు 4). అది ఆ విధానంలో దాన్ని చేయాలా? బహుశ కాదు. ఎప్పుడైతే యేసు ప్రభువు వచ్చాడో ఆయన ఒక మాట మాత్రం సెలవిచ్చాడో లేదో ప్రజలు మరణంనుండి లేచారు (పోల్చు లూకా 7:14; etc.).

ఇక్కడ మనకు శక్తికి గల నిజమైన కారణమేమిటో బాగా అర్థమవుతుంది: అంటే ఆ పసి బాలుని పై ఏలీయా చాచుకొని పడుకున్న ప్రక్రియ ముఖ్యం కాదు కాని అతని ప్రార్థన: "ఓ ప్రభువా దేవా ఈ శిశువులోనికి ప్రాణాన్ని తిరిగి తీసుకొని రండి, లేపండి." ఈ

జరిగిన అద్భుతం మన మనసులను అసలైన సందేశాన్ని మరుగు పరచకుండ చూడండి: ఏలీయా తన సమస్యను *దేవుని* దగ్గరకు తెచ్చాడు.

గతంలో మూడు సంవత్సరాలకుపైగా ఏలీయా జీవితంలో వర్షం ఆపివేసిన అనుభవం ఉంది. తర్వాత అధ్యాయాల్లో అదే ప్రార్థన అగ్నిని ఆకాశంనుండి కురిపించి వర్షాన్ని మరలా తీసుకొని వచ్చింది. ఈ ప్రవక్త ప్రార్థనయందు నమ్మికయుంచాడు - అతను ప్రార్థించాడు కూడ. ప్రార్థనలో శక్తి యున్నది.

మీరేమైన అసాధ్యమైన పరిస్థితుల్లో ఉన్నారా? ఇదిగో ఈ వచనం మీరున్న పరిస్థితిలో మీకు సూటిగా సహాయం చేస్తుంది: "ఇది మనుష్యులకు అసాధ్యమే *గాని దేవునికి* సమస్తమును సాధ్యమని చెప్పెను" (మత్తయి 19:26; నొక్కి చెప్పింది నాది). మీరు ఒకవేళ మరణము, అసాధ్యమైన పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు *ప్రార్థన* చేయండి. మోకాళ్ళ పై ప్రార్థించండి. ప్రార్థించడం కష్టతరమైన పరిస్థితుల్లోనే ప్రార్థించండి. "నా చిత్తము కాదు, నీ చిత్తమే జరుగును గాక" అంటూ ప్రార్థించండి. నీవు నీవుగావుండాలను కుంటే ప్రార్థించండి.

జీవిత సమస్యలవలన నిరుత్సాహపడిన ఒక క్రైస్తవ తండ్రిని మరియు ఉపాధ్యాయున్ని గూర్చి నేను చదివాను. అతడు, "నా విద్యార్థుల కొరకు మరియు నా పిల్లల కొరకు ప్రార్థించితిని గాని, ఏమియు జరుగలేదు. తరువాత నేను నా విద్యార్థి యొక్క ఉపాధ్యాయుని గూర్చి మరియు నా పిల్లల తండ్రికొరకు ప్రార్థించితిని, అయితే పరిస్థితులు మెరుగుపడ్డాయి."

## ఫలితాలు (18:22-24)

ఇక్కడ రెండు ప్రాముఖ్యమైన ఫలితాలున్నాయి. మొదటిది, ఆరోగ్యం కోలుకున్నది.

ఈ సంఘటనలు ఒక్కొక్కటి జరుగుతున్న కొలది ఆ తల్లి ఎంతో బలపడింది, ధైర్య పడింది. ఆమె ఎక్కడా లేని విశ్వాసాన్ని గుండెలనిండా నింపుకుంది. 24వ వచనం చూద్దాం. ఆమె కుమారుడు బ్రతికాడు ఆమె ఒడిలో చేరినాడు. "అప్పుడు ఆమె ఏలీయాతో, 'ఇప్పుడు నీవు దేవుని మనిషివని *తెలుసుకుంటున్నాను*, నీ నోటవున్న దేవుని వాక్కు ఎంతో సత్యమైనది' " అన్నది. (నొక్కి చెప్పింది నాది.) ఈ విధవరాలు అనేక అద్భుతాలను గతంలో చూచింది కాని యిది యింకా ఆమెలో దృఢంగా నాటుకొనిపోయింది!

యూదులు ఆచారపరంగా ఏమనుకుంటారంటే ఆమె యూదా మతంలోకి మారింది అని. ఆమె కుమారుడు యోనా అని. తర్వాత అతనొక ప్రవక్త అయినాడు.[4] ఇది వాస్తవమో కాదో గాని ఈ స్త్రీ తన యొక్క అసాధ్యమైన పరిస్థితుల్లోనుండి ప్రభువుపట్ల మంచి విశ్వాసంతో వచ్చింది.

ఏదెలావున్నా, ఆ తల్లి బలపడడమేకాదు; ఏలీయా సైతం ఎంతో బలపడ్డాడు. గడిచిన మూడున్నర సంవత్సరాల కరవునుండి బైటపడినదానికంటె రెండింతలుగా ప్రోత్సాహంతో స్థిరపడినాడు. తర్వాత అధ్యాయంలో చూచినట్లయితే అతడొక్కడే రాజు ముందు నిలబడుతున్నాడు, అంతేకాదు 450 మంది బయలు ప్రవక్తలను సవాలు చేయడానికి నిలిచాడు, ఆ పరిస్థితి ఏలీయాను ఏవిధంగా కించపరచలేదు. యెహోవా దేవుని సహాయంవల్ల అతడు మరణాన్నే జయించాడు. గతంలో ఎప్పుడూ అలా జరగలేదు. జీవ

మరణాలతో పోరాడిన యితనికి అగ్ని ఒక లెక్కా చెప్పండి?

మన జీవితాల్లో అసాధ్యమైన సమస్యలు ఎదుర్కోవడం మనకెవరికి యిష్టం లేదు. మనలో అలాంటివి కావాలని ఉద్దేశపూర్వకంగా మనం అడగడం. దీన్ని మనం ఏ విధంగా గ్రహించగలమంటే: దేవుని సహాయంతో అసాధ్యమైన విషయాలను పరిష్కారం చేసుకో గల్గినందులకు, అలా ఒక్కొక్కటి ఎదురౌతున్నప్పుడు విజయంతో ముందుకెళుతూ బలపడుతుంటాం. చివరకు జీవితంలో ఏది ఎదురైనా యిట్టే జయించగల్గే ధైర్యాన్ని పుంజుకుంటాం.

ఇక్కడ ఈ కథ యొక్క మలుపును చూద్దాం. రెండవ ఫలితమేమంటే బహుమతులు పొందడం. రోమీయులకు 8:28, "సమస్తము సమకూర్చి మేలుచేయుటకు దేవుడు పని చేస్తాడు" అంటుంది. ఈ కథకూడ ఈ సత్యాన్ని వివరించుటకు ఎంతో అందమైన ఉదాహరణతో కూడుకొనియున్నది. నేను ఒకసారి ఈ విధంగా ప్రసంగం చేస్తుంటే ఒక శ్రోత నిలబడి "ఇలా సుఖాంతం అయిన కథలు అంటే నాకెంతో యిష్టం" అని సంతోషంగా చెప్పాడు. ఔను ఈ కథ సుఖాంతం అయింది కూడ. దేవుడు ఏలీయా స్వరాన్ని విన్నాడు. ఆ బాలుని ప్రాణం తిరిగి అతన్ని జీవింపచేసింది. మరియు ఏలీయా ఆ బాలుని తీసుకొని తన మేడగదినుండి క్రిందకు దిగివచ్చి ఆ తల్లి ఒడిలో పెట్టాడు. ఎంతో సంతోషంతో, "ఇదిగో నీ కుమారుడు; వాడు బ్రదుకుచున్నాడు" అన్నాడు ఏలీయా (1 రాజులు 17:22, 23 వచనాలు).

ఏలీయా ఎప్పుడైతే తన బిడ్డను బ్రతికించి తన ఒడిలో వేసినాడో ఆమె పట్టరాని ఆనంద ఆశ్చర్యాలతో నిండిపోయింది. ఇక్కడ ఏలీయా ఎంతో సరళంగా మాట్లాడుతున్నాడో చూచావా: "నీ కుమారుడు బ్రతికాడు" అన్నాడు. అంతేగాని "*నేనేం* చేశానో చూడు" అనలేదు. "నీ కుమారుడు బ్రతికాడు చూచావా" అన్నాడు. ఆహా ఆ కుటుంబంలో ఆనందం విరబూసింది. ఇప్పుడు కూడ కన్నీరు కారింది గాని అవి ఆనంద భాష్పాలు అని చెప్పవచ్చు.

ఇక్కడ ప్రార్థన ద్వారా మనం మన ప్రియులను సంపాదించుకుంటాం అని అనడం లేదు గాని, ప్రార్థన మనలను విజయవంతులుగా బయటపడటానికి సహాయం చేస్తుంది. 1985 డిసెంబర్ నెలలో డల్లాస్‌లో జీవిస్తున్నప్పుడు పోర్ట్ వర్త్ అనే కూడికలో ఒక స్త్రీ యొక్క కుమారుణ్ణి దొంగలు కాల్చి చంపినారు. వారు ఒక షాప్‌ను కొల్లగొట్టుకుంటున్నప్పుడు జరిగిన సంఘటన. ఈ దుర్ఘటనను పొరపాటున ఒక వీడియో మానిటర్‌లో చిత్రీకరించడం జరిగింది. తర్వాత టీవి ఆ స్త్రీని చూపించింది. అపస్మారక స్థితిలోవున్న తన కుమారునితో ఆమె ఏదో మాట్లాడుతుంది. ఆమె కుమారుడు చనిపోయిన తర్వాత కొందరు ఆమెను ఇంటర్వ్యూ చేయడం గమనిస్తున్నాం. ఆమె తన భావాలను వారికి వ్యక్తం చేస్తూ, ఆమె కుమారుడు చనిపోవడానికి సిద్ధంగావున్నాడని తనకు గ్రాహ్యమైయిందని, అయినప్పటికి ఆమె నింపాదిగా నిబ్బరంగా హృదయం నిండా శాంతి నింపుకొన్నానని చెప్పింది. ఇక్కడ వ్యాఖ్యాన కర్త చేసిన రెండు వాఖ్యానాలు నన్నాకట్టుకున్నాయి: (1) ఆమె దేహమంతా శక్తి మయమైనది నిరీక్షణా పూరితమైంది. (2) మరియు ఆమె మంచి దైవభక్తిగల స్త్రీ అనియు. ఔను నీవు చేయిదాటిపోయిన అసాధ్యమైన పరిస్థితుల్లోకి జారిపోయినప్పుడు సైతం *దేవుడు* నీకు సహాయం చేస్తాడు.

ఏదియెలా ఉన్నా, మనం మరొక్క అడుగు ముందుకెళదాం. ఇక్కడ తన కుమారుని పోగొట్టుకున్న సారెపతు విధవరాలు, మరియు తమ ప్రియులను పోగొట్టుకున్న కొందరిని సమాంతరంగా ఉంచుకొని ఆలోచిద్దాం: పౌలు 1 థెస్సలొనీకయులకు 4వ అధ్యాయంలో యిలా అంటున్నాడు:

> సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్నవారిని గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టము లేదు. యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించినవారిని *దేవుడాయనతోకూడ వెంటబెట్టుకొని వచ్చును.* ... ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి (13, 14, 17 వచనాలు; నొక్కి చెప్పింది నాది).

ఇక్కడ ఏలీయా గనుక ఆ బాలుని తిరిగి తీసికొనివచ్చి ఆ తల్లికి యిచ్చినట్లు, యేసు కూడ ఆయన తిరిగివచ్చినప్పుడు ఆయన మనం ఎంతో యిష్టంగా ప్రేమించిన వారిని తనతో కూడ తీసికొని వచ్చును. మనము అందరము ఎత్తబడి ఆకాశములో వారిని కలుసుకుంటాము. మనము నమ్మకంగావుంటే మనము సదాకాలము ప్రభువుతో ఉంటాము. ఆహా అదెంత కలియిక! "కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి" (1 థెస్సలొనీకయులకు 4:18).

## ముగింపు

మరలా మనం రోమీయులకు 8:28లోకి వెళదాం, అది మనం యింత వరకు చదివినదాన్నంతటిని ఎంతో సంక్షిప్తంగా వివరించుచున్నది: "దేవుడు సమస్తము సమకూర్చి మేలు జరుగుటకే చేస్తున్నాడు." మన దుఃఖాన్ని ఒక విజయముగా మార్చగలడు. ఏదెలావున్నా ఈ వాక్యభాగానికి రెండు షరత్తులున్నాయి: "ఎవరు దేవుని ప్రేమించారో, ఎవరు ఆయన సంకల్పముచొప్పున పిలువబడియున్నారో" అని ఉంటుంది. మనమంతా దేవుని ఆత్మతోను, హృదయముతోను మనసుతోను ప్రేమించవలెను. ప్రతి ఒక్కరు ఆయన సువార్త పిలుపుకు విధేయులమవ్వాలి (2 థెస్సలొనీకయులకు 2:14) విధేయత ద్వారా (మార్కు 16:16). ప్రతి ఒక్కరు *ఆయన* ఉద్దేశం వైపు తమ జీవితాలను మార్చుకోవాలి. యేసు ఏమన్నాడంటే: "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15).

నీవు దేవుని షరతులను అనుసరిస్తూ ఆయన ఆశీర్వాదాలకు కారకులగుచున్నారా? నీమీద సమస్యలు విరిగిపడినప్పుడు నీవు మరణాన్ని మరియు యితర అసాధ్యమైన పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు?

సూచనలు

[1]ఈ కథలో "ప్రాణము నిలువజాలనంత" అనే వాక్యభాగం "ఆయన మరణించాడు" అనే కఠిన విషయమును మృదువైన మాటలతో తెలిపే అలంకార భాష. [2]ఆమె మాటలలో విధవరాలు నిజానికి ఏమి చెప్పిందనే విషయమును గూర్చి కొన్ని ప్రశ్నలున్నాయి. హెబ్రీ భాషలో ఆమె వాక్యములోని ప్రారంభం అక్షరార్థంగా "నాకు ఏమో అదే నీకును?" ఏలీయా దైవజనుడైనందున దానికి విరుద్ధంగా ఆమె పాపియై యున్నందున, ఆమె పాపమునకు ఆమె కుమారుని మరణమును పాపమునకు శిక్షగా విధించబడిందని ఆమె చెప్పియుండవచ్చు. ఏది యేమైనా ఏదో ఒక మార్గములో ఏలీయా బాధ్యతగలవాడైయున్నాడు. [3]హెబ్రీలో దీనిని సూచించడానికి ఏమియు లేదు, అయితే స్పెట్టుజెంట్‌లో, "పిల్లవానిలోనికి ఆయన ఊదెను" అని చేర్చబడింది. [4]24 వచనంలో "సత్యము" అని తర్జుమా చేయబడిన హెబ్రీ పదం "అమిత్తయి" అనే పదమును రూపొందించారు. యోనా తండ్రి పేరు అమిత్తయి (యోనా 1:1). ఈ మూలమునుండి ఈ విధవరాలు అమిత్తయిని వివాహం చేసుకొని మరియు ఆమె కుమారుడే యోనా అని ఊహిస్తారు.

## దృశ్య సాధనాల-నోట్స్

మనం దుఃఖము అనే అంశము మీద ఒక వివరణాత్మకమైన చిత్రపటాల చార్ట్ ఒకటి తయారుచేసి ప్రదర్శించితే మంచిది. ఈ పాఠాల్లో నింపబడిన వివరాలు చాలా సంక్షిప్తంగా ఉన్నాయి. అందువల్ల ఈ చార్టు గనుక బహిరంగంగా చూడగల్గినట్లయితే అది ఎంతో మందికి మేలుకరంగా ఉంటుంది. ఒకే ఘట్టంనుండి మరో ఘట్టానికి వెళుతూ యిలా వివరించుకుంటూ పోతున్నప్పుడు మీరేమంత సిగ్గుపడనవసరం లేదు సుమా!

## పాఠం యొక్క సంక్షిప్త వర్ణన

**పరిచయం**

A. పరిచయానికోసం మన హెబ్రీ 11:32-35, విన్నట్లయితే మేలుకరంగా ఉంటుంది. "ఒక స్త్రీ మరణించిన తన కుమారుణ్ణి తిరిగి బ్రతికించుకోవడం" అనేది మొదటి సారి అని గ్రహించగలం.

B. మన పాఠం:

1. అమాంతంగా ఉపద్రవాలొచ్చి నెత్తినబడితే పరిస్థితులు ఎంత భయంకరంగా ఉంటాయో.
2. మనం 1 రాజులు 17:17-24 చూస్తే మూడు అంశాలు బయట పడతాయి. వాస్తవాలు, విరుగుడు మరియు ఫలితాలు.

**I. సాక్షాత్తు నిజం (17:17, 18)**

A. మనం చావుగురించి ఆలోచించడానికి భయపడతాం, అయినప్పటికి అది వాస్తవమే.

1. అది సైతాను యొక్క అబద్ధం: ఆదికాండం 3:4.
2. నిజం హెబ్రీయులకు 9:27.

B. ఆ స్త్రీకి చావు యొక్క వాస్తవం బాగ తెలుసు.

1. ఆమె భర్త చనిపోయాడు.

2. ఏలీయా వచ్చేసరికి ఆమె ఆమె కొడుకు చావడానికి సిద్ధంగావున్నారు. కాని వారు తాత్కాలికంగా తప్పించబడినారు.
3. ఇప్పుడు ఆమె కుమారుడే చనిపోయాడు (17 వచనం).

C. ఆమె యొక్క ప్రతి స్పందన ఎలావున్నదో చూద్దాం (18 వచనం).
1. మనం మొదట్లో ఆమెను చూచినప్పుడు ఆమెకు మరణం పట్ల ఎలాంటి దృక్పథం ఉండేదే యిప్పుడు ఆమె దృక్పథం పూర్తిగా మారినట్లు గమనిస్తున్నాం. అప్పుడామె అంత పట్టించుకో లేదు; గాని యిప్పుడు మహామండిపడుతుంది.
   a. మరణం తర్వాత జీవితంలోని మెట్లు:
      (1) ఏదో షాక్ విధానం
      (2) ఏదో మానసికంగ నడిపింపు
      (3) ఒంటరితనం, కృంగిపోవడం
      (4) విచారము ఆంధోళనలు
      (5) అపరాధి భావన
      (6) పగ లేక ఆగ్రహము
      (7) కార్యకలాపాలు కొనసాగించాలని శ్రమపడుట
   b. ఇక్కడ మనం "శత్రుత్వం హీనపరచుట" చూస్తున్నాం.
2. ఆమె ఏలీయా పట్ల మండి పడింది. కొన్నిసార్లు మనం మానసికంగ బాధలో చలించిపోయినప్పుడు. ఏవేవో గబగబా అనేస్తాం. తర్వాత అసలు అలా మనమేనా అనింది, అలా ప్రవర్తించింది మనమేగా అని నమ్మలేక పోతాం.

## II. పరిహారము (17:19-21)

A. ఏలీయా ఏం పని చేయకుండ ఉన్నాడు:
1. అతను కోపంతో త్రిప్పికొట్టలేదు.
2. ఇప్పటికే ఆమెకున్న ఆశీర్వాదాలను లెక్కించుకోలేదు.
3. ఆమె వేదాంతాన్ని అతను సరిచేయలేదు.

B. ఏలీయా ఈ పరిస్థితుల్లో ఐదు పనులు చేశాడు:
1. అతను అక్కడ ఆ సమయంలో ఉన్నాడు.
   a. వాస్తవానికి ఆ సమయంలో అంతకంటె చేయగలిగిందేమి లేదు. ఆ సందర్భంలో నీవేమియు చెప్పలేని స్థితిలోయున్నప్పటికి అక్కడ మాత్రముండు.
   b. వారం తర్వాత వారం నెల తర్వాత నెల తరచుగా వెళతావుండు.
2. అతడు ఆమె బాధను అర్థం చేసుకున్నాడు.
   a. అతను ఏం జరిగిందో దాన్ని చూచి ఎంతగానో చలించిపోయాడు (గమనించు వచనం 20). "ఏడ్చేవారితో ఏడ్వడం" దానికి వెనుకాడవద్దు (రోమీయులకు 12:15).

b. నీ “దుఃఖాన్ని” నీవు అదుపులో ఉంచుకో.

3. అవతలవాళ్ళు ఏమైనా పరవాలేదు, నీవైతే నిబ్బరంగా ఉండుము (contrast వచనాలు 18 మరియు 19ఎ).

   a. దీన్ని మానసిక అస్థిరత క్రింద లెక్కించావంటే నీవు సమస్యల్లో యిరుక్కున్నట్టే, అంతేగాని ఈ సమస్యకు ఒక ప్రత్యామ్నాయం కానేకాదు.

   b. 20వ వచనం ఏకాంతంగా చదువవలెను.

4. అతనేం చేయాలో అతను చేశాడు.

   a. ఆమె దగ్గరనుండి ఆమె కుమారుని, తీసికొని పడక మీద పడుకోబెట్టినాడు. ఏదైనా గృహం దుఃఖ సాగరంలో మునిగినప్పుడు వారి దగ్గరకు వెళ్ళి నీకు చేతనైనది చేసి ఆదరించుము.

   b. తర్వాత అతనేం చేశాడో అనే దాన్ని ఈ క్రింది అంశాలగుండా చదువుము.

5. అతి ప్రాముఖ్యమైన విషయం, ఆమె పక్షంగా అతను దేవుని వద్దకు వెళ్ళియున్నాడు (20 వచనం).

   a. యిక్కడ మనకు ఆసక్తికరమైన విషయం కనబడుతుంది. అదేమంటే అతను ఆ బాలునిపై ముమ్మారు పార చాచుకొనియున్నాడు (21 వచనం).

      (1) గతంలో చచ్చినవారు ఎవరు బ్రతుకలేదు. ఈ విషయంలో ఏలీయాకు గతంలో ఎలాంటి అనుభవం లేదు.

      (2) బహుశ అతను చేసేది సబబుగా తోచింది కాబట్టి అతనలా చేస్తున్నాడు (అంటే అతడు చేయగలిగిందే చేశాడు).

   b. వాస్తవానికి శక్తి అంతటికి గల కారణం అతను దేవుని దగ్గరకు ప్రార్థన ద్వారా వెళ్ళినాడు.

      (1) నీవు గనుక అసాధ్యమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నప్పుడు, దయచేసి మత్తయి 19:26 గుర్తుంచుకో.

      (2) ఏలీయా జీవితంలో అతని ప్రార్థనా ఏవిధంగా గొప్ప కార్యాలు జరిగాయి (ఉదాహరణకు ప్రార్థన ద్వారా వర్షం ఆగిపోవడం) అతను ప్రార్థనాశక్తి అనేదేంటో బాగ జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

   c. నీవు గనుక మరణాన్ని యింకా అసాధ్యమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో *ప్రార్థన* మాత్రం మర్చి పోవద్దు.

## III. ఫలితాలు (17:22-24)

A. శక్తి సమకూర్చుకొనబడింది.

1. నిజమైన దేవుని పట్ల ఆ స్త్రీకున్న విశ్వాసము బలపర్చబడింది (24 వచనం) ఏలీయా కూడ బలపర్చబడియున్నాడు. తర్వాత అతను బయలు

ప్రవక్తలవైపుకు తిరిగినాడు.

2. దేవుని సమయంలో అసాధ్యం, అబేద్యమైన కార్యాలు మనం సాధించగల్గుచున్నప్పుడు మనకు ఎక్కడ లేని బలం లభిస్తుంది.

B. బహుమానములు స్వీకరించబడినవి (రోమీయులకు 8:28ఎ).

1. ఆ స్త్రీ యొక్క కుమారుడు బ్రతికించబడినాడు ఆమెకప్పగింపబడినాడు (వచనాలు 22, 23).

2. మనమన జీవితాల్లో ఎదురయ్యే ప్రతి అడ్డంకులను సమస్యలను తొలగించుకోడానికి ప్రార్థన ఎంతైనా అవసరం. అంతకంటె కూడ మనం, అంతేగాకుండ మనం దేవునికి విధేయత చూపినట్లయితే యేసు రాకడ కోసం ఎదురుచూస్తుంటాం (1 థెస్సలొనీకయులకు 4:13, 14–17).

**ముగింపు**

ఈ వాగ్దానాలన్ని "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువబడినవారికి" చెందుతాయి (రోమీయులకు 8:28బి).